

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక


PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 24-05-2025 | సంపుటి - 24 | సంచిక - 22 | రూ : 4 | పేజీలు: 8


## 227 మంది ప్రాణాలతో పాక్ చెలగాటం

- ప్రమాదపుటంచుల్లో ఉన్న భారత విమానంపై ఆ దేశం నిర్దయ
- గగనతలంలోకి ప్రవేశించేందుకు అనుమతించని వైనం

2లో



## తెలంగాణ అభివృద్ధికి
# కేంద్రంతో కలిసి పనిచేస్తా




- మరో 50 సార్లయినా ప్రధానిని కలుస్తా
- త్వరలో నిమ్జ్‌లో హ్యుందాయ్ కార్ల పరిశ్రమ
- జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## తెలంగాణ.. మా హృదయాన

- రాష్ట్రంపై ప్రపంచ సుందరీమణుల ప్రశంసలు
- మిస్ వరల్డ్ హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్ విజేతలు తుర్కియే, వేల్స్, జాంబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో భామలు
- తెలంగాణ, సామాజిక అంశాలపై ప్రశ్నలడిగిన న్యాయనిర్ణేతలు

**మే 23, హైదరాబాద్:** ప్రపంచ సుందరి పోటీల్లో కీలకమైన హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్‌లో నలుగురు విజేతలుగా నిలిచారు. ఆసియా ఓషియానా ఖండం నుంచి

తరువాయి 2లో



# ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్

- రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రధాని

దిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు గతంలో ఎప్పుడూ లేనంతగా పురోగమిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వైవిధ్యమే ఈశాన్య ప్రాంతానికి అతిపెద్ద బలమన్నారు. దిల్లీలోని భారత మండపంలో రెండు రోజులపాటు జరిగే రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సును శుక్రవారం మోదీ ప్రారంభించారు. సదస్సుకు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు, దౌత్యవేత్తలు తదితరులు తరలివచ్చారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, అనిల్ అగర్వాల్ వంటి పారిశ్రామికరంగ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈశాన్య భారతం ఒక పవర్‌హౌస్ అని, మనకు అష్టలక్ష్మి వంటిదని అభివర్ణించారు. భారతదేశ సెమీకండక్టర్ వ్యవస్థను బలోపేతం చేయడంలో అస్సాం పాత్ర పెరుగుతోందన్నారు. గతంలో ఈశాన్య ప్రాంతమంటే బాంబులు, తుపాకులు, రాస్తారోకోలకు మారుపేరుగా ఉండేదని, దీనివల్ల స్థానిక యువత చాలా అవకాశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంలో ఈశాన్య యువత హింసను విడిచిపెట్టినట్లు ప్రధాని తెలిపారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, నక్సలిజాన్ని ఉపేక్షించడం లేదన్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని అవకాశాల భూమిగా మార్చడం లక్ష్యంగా

తరువాయి 2లో





## అమరావతిని రాజధానిగా
# నోటిఫై చేయండి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం చంద్రబాబు వినతి
- వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే చేయాలని కోరినట్లు వెల్లడి
- విశాఖకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రకటన
- అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి?
- రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ?
- వైకాపా అధినేత వైఖరిపై చంద్రబాబు అసహనం

**మే 23, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ మేరకు విభజన చట్టాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి హోంమంత్రిత్వశాఖ కార్యాలయంలో అమిత్‌షా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని శాంతిభద్రతలు, కొత్త నేర న్యాయ చట్టాల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లాడారు.

తరువాయి 2లో

# భారాసలో కోవర్టులున్నారు



2లో

- వారిని తప్పించి.. ముందుకెళ్తే పార్టీదే భవిష్యత్
- కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయి
- గతంలో కూడా అనేకసార్లు లేఖలు రాశా
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# 15 చ.కి.మీ... 15 వేల మంది బలగాలు

- అష్టదిగ్బంధనంలో మావోయిస్టు అగ్రనేతలు
- చివరి దశకు ఆపరేషన్ కగార్
- లొంగిపోయేందుకు కొందరి ప్రయత్నం!

**మే 23, హైదరాబాద్:** పదిహేను చదరపు కిలోమీటర్ల పరిధిలో... పదిహేను వేల మంది భద్రతా బలగాలు... ఇదీ ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని

తరువాయి 2లో



# తెలంగాణ అభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తా



జహీరాబాద్: రాష్ట్రాభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిధుల కోసం అవసరమైతే ప్రధాని మోదీని మరో 50 సార్లు కలిసేందుకు సిద్ధమన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి రూ.494.67 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం జహీరాబాద్ పట్టణం పస్తాపూర్‌లో జరిగిన ప్రజాపాలన.. ప్రగతి బాట బహిరంగ సభలో ప్రసంగించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని.. ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధే తనకు ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయన్నారు. కేంద్రంపై అలిగితే రాష్ట్రాలకే నష్టమని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ ప్రాంతంతో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఉన్న అనుబంధం విడదీయలేనిదని సీఎం రేవంత్ అన్నారు. తుది శ్వాస వరకు ఆమె మెదక్ ఎంపీగా, ప్రధానిగా దేశానికి సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిమ్జ్ నిర్లక్ష్యానికి గురైందని, అభివృద్ధి కుంటుపడిందని ధ్వజమెత్తారు. ''రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేసి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారాన్ని భారీగా పెంచాం. భూములు ఇస్తున్న 5,612 మంది రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. త్వరలోనే బాధిత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి ఇళ్ల మంజూరు పత్రాలు అందించే బాధ్యతను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి అప్పగిస్తున్నా. త్వరలోనే నిమ్జ్‌కు హ్యుందాయ్ కార్ల పరిశ్రమ రాబోతోంది. ఇది చెప్పడానికి సంతోషంగా ఉంది.

*** అదానీ, అంబానీతో ఆడబిడ్డల పోటీ**

రాష్ట్ర ఆడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఐదేళ్లలో కోటి మందిని కోటీశ్వరులను చేస్తానని మాట ఇస్తున్నా. అమ్మగారి ఇంటికి వెళ్లాలన్నా.. అమ్మోరును దర్శించుకోవాలన్నా గతంలో మహిళలు బస్సు ఛార్జీల కోసం ఇంటాయనను అడగాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు. ఇందుకోసం 18 నెలల్లో రూ.5,500 కోట్లు విడుదల చేశాం. స్వయం సహాయక సంఘాలకు గతేడాది రూ.20 వేల కోట్లు, ఈ ఏడాది రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. 600 బస్సులను మహిళలు ఆర్టీసీకి అద్దెకు ఇస్తున్నారు. పెట్రోల్ బంకులు, ఇందిరా శక్తి క్యాంటీన్లు నిర్వహిస్తూ.. ఉపాధి పొందుతున్నారు. గతంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని ప్రకటించిన కేసీఆర్.. తన ఇంట్లో మాత్రమే ఉద్యోగాలు ఇచ్చుకొని నిరుద్యోగులను మోసం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. మరో లక్ష ప్రైవేటు కొలువులు వచ్చాయి. నేను గెలిచినా.. ఓడినా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నా. ముఖ్యమంత్రి అయ్యాక.. ఏనాడూ అహంభావం ప్రదర్శించలేదు. చిన్న.. పెద్ద తేడా లేకుండా ఎవరొచ్చినా కలుస్తున్నా. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోయేది లేదు'' అని సీఎం రేవంత్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# తెలంగాణ.. మా హృదయాన...

(మొదటిపేజీ తరువాయి)

తుర్కియే సుందరి ఇదిల్ బిల్గెన్, యూరప్ నుంచి వేల్స్ భామ మిల్లి మా ఆడమ్స్, ఆఫ్రికా నుంచి జాంబియా సుందరి ఫెయిత్ బ్వాల్యా, అమెరికా కరేబియన్ నుంచి మిస్ ట్రినిడాడ్ అండ్ టొబాగో అన్నాలైసే నాన్‌టన్ న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతలయ్యారు. శుక్రవారం హైదరాబాద్ ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్‌లో ఒక్కో ఖండం నుంచి ఐదుగురు చొప్పున మొత్తం 20 మంది పోటీపడ్డారు. వీరిలోంచి తదుపరి రౌండ్‌కు ప్రతి ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేసి.. వారి వాగ్ధాటి, మేధస్సు, సామాజిక దృక్కోణం ఆధారంగా ఒక్కో ఖండం తరపున ఒక్కర్ని విజేతగా ప్రకటించారు. వీరు ఆయా ఖండాల తరపున టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకున్నారు.

*** మహిళా భద్రతపై అభినందనలు**

హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్‌లో వివిధ ఖండాల నుంచి వచ్చిన అందాల భామలు రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. తెలంగాణలో మహిళల భద్రత, సాధికారతపై ప్రపంచానికి మీరు ఏం సందేశం పంపిస్తారు? అన్న ప్రశ్నకు బ్రెజిల్, సురినామ్, కేమెన్ ఐలాండ్స్, గయానా, ట్రినిడాడ్ అండ్ టొబాగో భామలు ఆసక్తికర సమాధానాలిచ్చారు. ఇక్కడ మహిళల భద్రతను హక్కుగా గుర్తించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్న విషయాన్ని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రిపూట స్వేచ్ఛగా తిరగడం ఆశ్చర్యం కలిగించిందని.. ఇది సురక్షిత నగరానికి ప్రతీక అని చెప్పారు. 'తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?' అన్న ప్రశ్నకు సాంకేతికత, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా మహిళల హక్కులు, విద్య, సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చే రాష్ట్రంగా పోటీదారులు అభివర్ణించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు స్ఫూర్తిదాయకంగా అనిపించాయని, ఇక్కడి ప్రజల ఆదరణ, ఆతిథ్యం నచ్చిందని 'బ్యూటీ విత్ ఏ పర్పస్' భావన ఇక్కడి జీవనశైలిలో కన్పించిందని చెప్పారు. 'నా దేశానికి ల్యాండ్ ఆఫ్ సన్‌షైన్ అనే పేరు ఉంది. ఆ పేరు తెలంగాణకు చక్కగా సరిపోతుంది' అని ట్రినిడాడ్ సుందరి అన్నారు.

*** వ్యక్తిత్వం కోల్పోకూడదు..**

సవాళ్లు మీ ఎదుగుదలకు అవకాశాలుగా ఎలా మారాయన్న ప్రశ్నకు 'ప్రపంచం మారవచ్చు కానీ మీరు మారాల్సిన అవసరం లేదు. ప్రపంచం స్వీకరించకపోయినా నిజమైన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు'అని మిస్ వరల్డ్ జాంబియా సమాధానమిచ్చారు. యువత జీవితాలను మెరుగుపర్చడానికి మీరు ఒక మార్పు అమలు చేయగల్గితే అది ఏంటి? అనగా విద్య అత్యంత శక్తిమంతమైన సాధనం అని మిస్ వరల్డ్ వేల్స్ అన్నారు. 'బ్యూటీ విత్ ఏ పర్పస్' ప్రాజెక్ట్‌తో పనిచేయడం మీ దృక్పథాన్ని ఎలా మార్చిందని అడగ్గా క్యాన్సర్‌తో తన తల్లిని కోల్పోయిన ఆంకాలజిస్టు మిస్ వరల్డ్ తుర్కియే.. తన దేశంలో క్యాన్సర్ అవగాహనకు మద్దతు ఇస్తున్నానని చెప్పారు. వాతావరణ మార్పుపై అభిప్రాయం అడగ్గా 'నేను ప్రకృతితో నిండిన భూమి నుంచి వచ్చాను. ప్రేమిస్తూ కాపాడుకుంటాను. పర్యావరణంతో తిరిగి అనుసంధానం కావడానికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. చిన్న అడుగులు సైతం స్థిరమైన భవిష్యత్తును నిర్మిస్తాయి' అని మిస్ వరల్డ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో సమాధానమిచ్చారు.

*** నేడు టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్ ఫైనల్..**

అందాల పోటీల్లో మరో కీలకమైన పోటీ శనివారం జరగనుంది. మిస్ వరల్డ్ టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్ ఫైనల్‌ను హైటెక్స్‌లో నిర్వహించనున్నారు.

# భారాసలో కోవర్టులున్నారు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్, శంషాబాద్:: భారాసలో ఉన్న చిన్న చిన్న లోపాలపై చర్చించుకొని, సవరించుకోవడంతో పాటు కోవర్టులను పక్కకు తప్పించి ముందుకెళ్తే భవిష్యత్తు పార్టీదేనని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ''కేసీఆర్ దేవుడు.. కానీ కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయి. వారి వల్ల నష్టం జరుగుతోంది'' అని వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రజతోత్సవ సభ అనంతరం భారాస అధినేత కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ గురువారం వెలుగులోకి వచ్చి చర్చనీయాంశమైన నేపథ్యంలో.. కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''నా కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి వెళ్లిన తర్వాత లేఖ లీక్ అయి హంగామా జరిగినట్లు తెలిసింది. రెండు వారాల క్రితం నేను కేసీఆర్‌కు లేఖ రాశా. గతంలో కూడా లేఖల ద్వారా కేసీఆర్‌కు అనేకసార్లు అభిప్రాయాలు చెప్పా. నాపై కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని ఇటీవలే చెప్పా. ఇప్పుడు లేఖ బహిర్గతం అవ్వడంతో.. ఏం జరుగుతున్నదోనని పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పార్టీలో అన్ని స్థాయుల్లో ఉన్న వారు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో చెప్పా. ఇందులో నాకు వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. వ్యక్తిగతంగా నాకు ఎవరిపైనా ద్వేషం లేదు.

*** లేఖ బహిర్గతం వెనుక ఎవరున్నారో..**

మా పార్టీ అధినేతకు రాసిన లేఖ బహిర్గతమైందంటే.. దాని వెనుక ఎవరున్నారో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే.. పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏమిటి? దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. నేను కేసీఆర్‌కు లేఖ ద్వారా వ్యక్తపర్చిన అభిప్రాయాల్లో ప్రత్యేకత ఏమీ లేదు. అది బహిర్గతం కావడం బాధాకరం. లేఖ బయటకు రావడంతో భాజపా, కాంగ్రెస్ పార్టీలు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు సంబరపడుతున్నాయి. భారాస ఆగమైనట్లు ఆ పార్టీల నాయకులు మాట్లాడుతున్నారు. మా నాయకుడు కేసీఆరే. ఆయన నాయకత్వంలో తెలంగాణ బాగుపడుతుంది. పార్టీ కూడా ముందుకెళ్తుంది. కాంగ్రెస్, భాజపాలు విఫలమయ్యాయి. వాటికి కేసీఆర్ నాయకత్వమే ప్రత్యామ్నాయం'' అని కవిత పేర్కొన్నారు. కవితకు స్వాగతం పలికేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చినా ఎవరూ గులాబీ కండువాలు వేసుకోలేదు. ''కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి.. సీఎం.. సీఎం..'' అని నినాదాలు చేశారు. అభిమానులకు అభివాదం చేసి కవిత వెళ్లిపోయారు.

# 15 చ.కి.మీ... 15 వేల మంది బలగాలు

(మొదటిపేజీ తరువాయి)

దండకారణ్యంలో నెలకొన్న పరిస్థితి. మావోయిస్టు అగ్రనేతలంతా ఈ కొద్ది ప్రాంతంలోనే దాగి ఉన్నారనే సమాచారంతో చుట్టుముట్టిన భద్రతా బలగాలు రోజురోజుకూ చొచ్చుకెళుతున్నాయి. లొంగిపోవడం మినహా మరో మార్గం లేకపోవడంతో కొందరు అగ్రనేతల తరపున ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికల్లా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఉనికి లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. మొదట దాదాపు 45 వేల మంది భద్రతా బలగాలు దండకారణ్యం నలువైపుల నుంచి లోనికి చొచ్చుకుని వెళుతూ ఎక్కడికక్కడ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకున్నాయి. వీటి చుట్టుపక్కల ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో పదుల సంఖ్యలో మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందగా... అంతకు రెట్టింపు సంఖ్యలో లొంగిపోయారు. ఇటీవల పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల కారణంగా కొంతమేరకు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని వెనక్కి పంపారు. అయితే, తమ వ్యూహాన్ని మాత్రం కొనసాగించారు. దాని ఫలితంగా... పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్... ఎదురుకాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. ఇప్పుడిక కేవలం 15 చదరపు కిలోమీటర్లు తప్ప మిగతా ప్రాంతమంతా భద్రతా బలగాల చేతిలోకి వచ్చింది. నారాయణపుర్, బీజాపుర్, దంతెవాడల మధ్య విస్తరించిన ఈ దట్టమైన అడవిలోనే మావోయిస్టుల మిగిలిన అగ్రనేతలంతా దాగి ఉన్నారని అధికారులు బలంగా నమ్ముతున్నారు. తమ వ్యూహాన్ని కొనసాగిస్తున్న 15 వేల మంది భద్రతా బలగాలు నలువైపుల నుంచి కమ్ముకొస్తుండటంతో పార్టీ అగ్రనేతల పరిస్థితి ఏమవుతుందన్నది ఉత్కంఠ రేకెత్తిస్తోంది. మావోయిస్టులు ప్రతిపాదించిన శాంతిచర్చలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తిరస్కరించింది. వారు స్వచ్ఛందంగా కాల్పుల విరమణ ప్రకటించినా పట్టించుకోలేదు. మావోయిస్టులను పూర్తిస్థాయిలో రూపుమాపాలన్న లక్ష్యంతో చొచ్చుకెళుతున్న కేంద్ర బలగాలకు మిగిలిన ఈ 15 చదరపు కిలోమీటర్లను స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ఎక్కువ రోజులు పట్టకపోవచ్చని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

**వారి నుంచి ప్రతిఘటన కష్టమే!**

ఇప్పటికే పూర్తిస్థాయిలో బలహీనపడిన మావోయిస్టులు తమను చుట్టుముట్టిన 15 వేల మంది బలగాలను ఢీకొట్టే పరిస్థితి లేదని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. లొంగిపోవడం మినహా వారికి మరో మార్గమే లేదని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణాలు నిలుపుకోవాలంటే లొంగిపోవడం ఒక్కటే పార్టీ నేతలకు మిగిలిన ప్రత్యామ్నాయం. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న అగ్రనేతలు ఈ దశలో లొంగిపోతారా... అన్నది అనుమానమే. వీరిలో ఒకరిద్దరి తరపున లొంగుబాటు కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మావోయిస్టు అగ్రనేతల్లో గణపతి, మల్లోజుల కోటేశ్వరరావు, తిప్పిరి తిరుపతి, కడారి సత్యనారాయణ, పుల్లూరు ప్రసాద్, మల్లా రాజిరెడ్డిలతోపాటు కేంద్ర కమిటీలో మెజార్టీ సభ్యులు తెలుగు వారే ఉన్నారు.

# 227 మంది ప్రాణాలతో పాక్ చెలగాటం

దిల్లీ: ఉరుములు, మెరుపులతో కూడిన కారుమబ్బులు. విమానం అలాగే ముందుకు చొచ్చుకువెళితే అందులోని ప్రయాణికులందరికీ ప్రాణగండం! కాస్తంత దారి మార్చి పక్కకు వెళదామంటే దాయాదిదేశం పాకిస్థాన్ గగనతలంలోకి వెళ్లక తప్పని పరిస్థితి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సునాయాసంగా పక్కదేశ గగనతలంలోకి వెళ్లలేని దుస్థితి...అయినా ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలనే సంకల్పంతో విమానాన్ని పాకిస్థాన్ గగనతలంలోకి తీసుకెళ్లడానికి పైలట్లు అభ్యర్థించారు. అయితే పాకిస్థాన్ అధికారుల పాషాణ హృదయం కరగలేదు. విమానాన్ని అనుమతించడానికి ససేమిరా అన్నారు. విధిలేని పరిస్థితుల్లో పైలట్లు ఆ లోహవిహంగాన్ని ఉరుములు, మెరుపులు, వడగళ్ల వానతో కూడిన కారుమబ్బుల్లోకి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో అది తీవ్ర కుదుపులకు లోనైంది. ప్రమాదపుటంచులకు చేరువైంది. వేల అడుగుల ఎత్తునుంచి అత్యంత వేగంగా కిందకు జారడం మొదలైంది. విమానంలోని ఒక్కొక్క వ్యవస్థా మొరాయించసాగాయి. వడగళ్లు అత్యంత బలంగా విమానాన్ని తాకుతున్నాయి. భారీ కుదుపులకు ప్రయాణికులు హాహాకారాలు చేస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో పైలట్లు ఎంతో ధైర్యసాహసాలతో విమానాన్ని ముందుకు నడిపించారు. చాకచక్యంతో కిందికి దించారు. 227 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడారు. బుధవారం దిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో 6ఇ 2142 విమాన ప్రయాణికుల భీతావహ అనుభవం ఇది. ఈ ఘటనపై భారత పౌరవిమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) శుక్రవారం ఒక సవివర ప్రకటన విడుదల చేసింది.

**ఏం జరిగింది?**

శ్రీనగర్‌కు చేరే క్రమంలో పఠాన్‌కోట్ వద్ద ఈ విమానానికి ప్రతికూల వాతావరణం ఎదురైంది. దీంతో నిర్దేశిత ప్రయాణ మార్గానికి ఎడమవైపునకు (అంతర్జాతీయ సరిహద్దు దిశగా) మళ్లడానికి అనుమతించాలని వైమానిక దళానికి చెందిన నార్తర్న్ కంట్రోల్‌కు పైలట్లు విజ్ఞప్తి చేశారు. ఇలా వెళ్తే విమానం కొద్దిసేపు పాక్ గగనతలంలో ప్రయాణించాల్సి వస్తుంది. అయితే ఇండిగో పైలట్ల విజ్ఞప్తిని నార్తర్న్ కంట్రోల్ తిరస్కరించింది.

- భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసేస్తూ పాక్ పౌరవిమానయాన అధికారులు ఇచ్చిన 'నోటమ్'ను గుర్తుచేస్తూ ఇండిగో సిబ్బందికి ఆ సూచన చేశామని వైమానిక దళ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆ విమాన ప్రయాణ మళ్లింపు ప్రణాళికపై సమన్వయం చేసుకోవడంలో తాము సాయం అందించినట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో దిల్లీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో మాట్లాడామని, లాహోర్ ఏటీసీని సంప్రదించడానికి అవసరమైన ఫ్రీక్వెన్సీలను ఇండిగో సిబ్బందికి అందజేశామని తెలిపాయి.
- దీనిప్రకారం ఇండిగో విమాన పైలట్లు.. లాహోర్ ఏటీసీని నేరుగా సంప్రదించారు. ప్రతికూల వాతావరణం కారణంగా పాక్ గగనతలంలో కొద్దిసేపు ప్రయణించేందుకు అనుమతి కోరారు. అటువైపు నుంచి తిరస్కరణ ఎదురైంది.
- ఒకవైపు ఉరుములు, మెరుపులతో కూడిన కారుమేఘం (థండర్‌స్టార్మ్ క్లౌడ్) కమ్ముకొస్తోంది. ఈ పరిస్థితుల్లో విమానాన్ని తిరిగి దిల్లీకి మళ్లించాలని పైలట్లు తొలుత భావించారు. అయితే అప్పటికే ఆ లోహవిహంగం.. కారుమేఘానికి బాగా చేరువగా వచ్చేయడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో అందులోకి ప్రవేశించాలని నిర్ణయించారు.

# ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల కీలక వాటాదారులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు ఒకే వేదిక మీదకు వచ్చారన్నారు. పర్యాటకంతోపాటు వివిధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.

**మోదీకి సెల్యూట్ చేస్తున్నా: ముకేశ్ అంబానీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సదస్సులో ప్రశంసలు కురిపించారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంలో ప్రధాని నాయకత్వ పటిమను కొనియాడుతూ.. సెల్యూట్ చేస్తున్నా అన్నారు. ఉగ్రవాదంపై భారత్ ఐకమత్యం, స్థిరత్వం, దృఢ సంకల్పంతో పోరాడుతోందన్నారు. మన సాయుధ దళాల శౌర్య పరాక్రమాలకు గర్వపడుతున్నట్లు తెలిపారు.

# అమరావతిని రాజధానిగా నోటిపై చేయండి

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులేమీ సమకూర్చడంలేదని, కానీ కొందరు మూర్ఖులు మాత్రం రాష్ట్రంలో ఏ చిన్న పని జరగకపోయినా అంతా అమరావతిలో ఖర్చు పెడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'కొందరు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి? రాజధాని కోసం రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ? హైదరాబాద్ వంటి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కు అవసరం లేదా? తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇవన్నీ మరిచిపోయి మూర్ఖంగా మాట్లాడే వ్యక్తులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజధానికి భూములు త్యాగం చేసేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోరని భరోసా ఇచ్చాం. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి అని అలాగే ఉంచుకుంటే మీరు అక్కడే ఉంటారు, రాజధానికి ఇస్తే చరిత్ర తిరగరాస్తారు, మీ జీవితాలు కూడా మెరుగుపడతాయని చెప్పడంతో ఇచ్చారు. అమరావతి శక్తి చాలా బలమైంది' అని చంద్రబాబు అన్నారు.

**బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు రావాలి**

'మేం బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు అమరావతికి రావాలని కోరుకుంటున్నాం. దానికి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు పెట్టదు. ఇన్వెస్టర్లే కడతారు. దాని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అమరావతికి అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. విశాఖను అత్యుత్తమ నగరంగా మార్చడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నాం. దాన్ని ఆర్థిక, విజ్ఞాన నగరంగా అభివృద్ధి చేస్తాం' అని సీఎం ప్రకటించారు.

**సంపద సృష్టించేది ప్రభుత్వ విధానాలే**

దేశంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కావాల్సింది మంచి ప్రభుత్వ విధానాలే తప్పితే డబ్బు కాదని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఆర్థిక సంస్కరణల తర్వాత గ్రోత్ రేట్ అసాధారణంగా పెరిగింది. ప్రభుత్వ విధానం కింద ఐటీని ప్రోత్సహించడం వల్ల మనకు విస్తృత ప్రయోజనం దక్కింది. సాధారణంగా అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ వచ్చినప్పుడు కేంద్రం ఎంత డబ్బులు ఇస్తుంది? అని అందరూ అడుగుతుంటారు. ఇక్కడ సంపద సృష్టించడానికి సరైన ప్రభుత్వ విధానాలు కావాలి. 20 ఏళ్ల క్రితం మన ఎయిర్‌పోర్టులు ఎలా ఉండేవో తెలుసుకదా.. వాటికి భిన్నంగా మేం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. దాని గురించి ప్రతిపాదించినప్పుడు డబ్బులు ఎక్కడున్నాయని నాటి ప్రధానమంత్రి వాజపేయీ కూడా అడిగారు. అప్పుడు మేం డబ్బు అవసరం లేదు.. అడిగిన పాలసీ ఇవ్వండి అని కోరాం. మీకు ఆసక్తి ఉంటే అందులో కేంద్ర ప్రభుత్వం తరపున వాటా పెట్టుకోండి, లేకపోతే అదికూడా వద్దని చెప్పాం. ప్రభుత్వ వాటా ఉంటే అక్కడ జరిగే వాణిజ్యంలో మీకూ ఆదాయం వస్తుందని తెలిపాం.

# కేటీఆర్ కు బీర్ల ఐలయ్య క్షమాపణ చెప్పాలి..

*** ఆలేరులో కక్షా రాజకీయాలకు తెరలేపుతున్న కాంగ్రెస్**

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ పై ఆలేరు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేశ కోరారు. శుక్రవారం రాజపేట లోని అతిథి గృహంలో ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిల్లర రాజకీయాలు చేయలేదన్నారు. , ఆలేరులో కక్ష రాజకీయాలకు తెర లేపవద్దని, స్థానిక సమస్యలు పట్టించుకుని రాజపేట మండలానికి సాగునీరు తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, మాజీ ఆలేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త రవీందర్ వై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు సబబు కాదన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఓపికను పరీక్షించొద్దని క్రమశిక్షణ గల పార్టీలో కొనసాగుతున్నందువల్లే ఓపికగా ఉన్నట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు మంచిది కాదని పదవులు శాశ్వతం కాదన్నారు. మాజీ ఎంపీటీసీ కొమ్ము పాండు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చి ప్రజలకు సేవ చేయాలని తనకిచ్చిన మెజారిటీని గౌరవించుకోవాలని కోరారు. మోత్కుపల్లి వద్ద శిక్షణ పొంది రాజకీయాలు చేయాలి : రాజకీయంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మాట్లాడే విధానం రాకపోతే మాజీ మంత్రి, ఆరుమార్లు ఆలేరులో ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు వద్ద శిక్షణ పొందాలని, ఆలేరులో రాజకీయరోత పుట్టిస్తున్న వ్యాఖ్యలు మంచిది కాదని టిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ అన్నారు. రాజపేట మండలంలో పలు విభాగాలలోని అధికారులు 15 నెలల్లో అనేక మంది బదిలీ అయ్యారని, ఉన్నవారు భయంతో పనిచేస్తున్నారని అందుకు కారణం అధికార పార్టీ వారే చెప్పాలన్నారు. గతంలో మాజీ



ప్రభుత్వ విప్ గొంగిడి సునీతపై కూడా వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనించారన్నారు. ఆలేరు ఎమ్మెల్యే పదవి ఎవరికి శాశ్వతం కాదన్నారు. చల్లూరు రెవెన్యూ పరిధిలోని 322 సర్వే నెంబర్లు భూమిపై స్పందించాలని కోరారు. సుమారు 400 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి నొక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కోరారు . స్థాయి లేదంటూ వారి వద్దకే వెళ్లి దండాలు పెట్టడం కాంగ్రెస్ ప్రతినిధులకే చెల్లిందని ఆరోపించారు. నల్లగొండలోని ప్రెస్ మీట్ ను అడ్డం పెట్టుకొని ఆలేరులో రాజకీయంగా అల్లర్లు జరిగే పరిస్థితులను తేవద్దని ఆయన కోరారు. కరే వెంకటయ్య, గడ్డమీద రవీందర్ గౌడ్ లపై కాంగ్రెస్ పార్టీ వారు చేసిన వ్యాఖ్యలపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి గౌడ్, రాజపేట పిఎసిఎస్ చైర్మన్ . చింతలపూరి భాస్కర్ రెడ్డి, రాజపేట మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందెల భాస్కర్ గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎర్రగోకుల జశ్వంత్, యువజన విభాగమ అధ్యక్షులు పల్లె సంతోష్, బూర్గు నర్సిరెడ్డి. స్.కె కరీం, జిల్లా మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య, రాజపేట పట్టణ పార్టీ అధ్యక్షులు బెడిదే వీరేశం, కొమ్ము పాండు, బిళ్ళకుదురు రాజు, ఎర్ర గోకుల చంద్రయ్య, బాలకృష్ణ, గోపగాని యాదగిరి గౌడ్, బూర్గు ధర్మారెడ్డి, గొల్లెన రవి, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.కేటీఆర్ కు బీర్ల ఐలయ్య క్షమాపణ చెప్పాలి.

## గృహ నిర్బంధం అక్రమం



జిన్నారం(గుమ్మడిదల), ప్రజాస్ఫూర్తి 23: గుమ్మడిదల మండలం నల్లవల్లి డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఉద్యమిస్తున్న గ్రామస్తులను, నాయకులను గృహనిర్బంధంలో ఉంచడం అత్యంత దుర్మార్గమైనదని గుమ్మడిదల గ్రామ రైతు జెఏసీ అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.డంపింగ్ యార్డ్‌ను ప్రతిఘటిస్తూ ప్రజల పక్షాన గళం వినిపిస్తున్న నాయకులను అణచివేయాలనే కుట్రతోప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నల్లవల్లి ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించి డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును పూర్తిగా విరమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల మద్దతుతో ఈ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మండల జేఏసీ నాయకులు చిమ్ముల దేవేందర్ రెడ్డి, సూర్య నారాయణ, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, అంజనేయులు యాదవ్, మల్లేష్ యాదవ్, నడిమింటి ఆంజనేయులు, వెంకటేష్ యాదవ్, పాల్గొన్నారు.

## జిల్లా విద్యాభివృద్ధిలో కలెక్టర్ కృషి అనిర్వచనీయం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా విద్యారంగంలో తనదైన శైలిలో వినూత్న పథకాలను పరిచయం చేస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు కృతజ్ఞతగా తాను రచించిన ఆదర్శప్రాయులు అనే పుస్తకాన్నీ , 1932లో రాజమండ్రిలో స్థాపించబడి ఆనాడు మహాత్మా గాంధీ దర్శించిన రత్నం అండ్ కంపెనీ తయారుచేసిన ప్రత్యేక సాంప్రదాయ సిరా పెన్నును కలెక్టర్ కి శుక్రవారం కొత్తగూడెం మండల విద్యాశాఖాధికారి డా. ప్రభుదయాల్ అందజేశారు. అందరు ప్రాథమిక విద్యార్థులకు ప్రత్యేక నోట్సులు, ప్రత్యేక వేసవి తరగతులు, పాఠశాలలో ఉపయోగకర మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణకై ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతల నిర్మాణం,ఆయా పాఠశాలలో చదువుతున్న బీద విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహాలు, రుద్రంపూర్ ప్రభుత్వ ఐటిఐ లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు పూర్తి స్టడీ మెటీరియల్ అందేలా కృషి చేశారు, అన్ని పాఠశాలలకు క్రీడా సామాగ్రి ఏర్పాటు , ఇలా పలు వినూత్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను పాఠశాలల్లో ప్రవేశపెట్టి, జిల్లా విద్యాభివృద్ధికి కృషి చేయడం మాత్రమే కాకుండా రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపును జిల్లా కలెక్టర్ సాధించారు.



## ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగానికి మూల స్తంభాలు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజాస్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాలని, వారు పాఠశాల నాయకులుగా ఉపాధ్యాయులకు అకాడమిక్ మార్గదర్శకత్వం వహిస్తూ విద్యార్థిని విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథంతో ఉంటూ నాణ్యమైన విద్యను పిల్లలకి అందించడంలో నిజమైన నాయకులుగా ఎదగాలని సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల వృత్యంతర శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు మనసుపెట్టి పనిచేస్తే సాధించలేని కార్యం ఏది ఉండదని, పాఠశాలలో సమాజ భాగస్వామ్యం పెంచుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో తమ పాత్ర పోషించాలని కోరారు. అంతకుముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత పాల్వంచలో జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మనుషుల నివాసానికి అనుకూలమైన ఈ భూగ్రహాన్ని రక్షించడంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని జీవశాస్త్రం చదవటం అంటే కేవలం డాక్టర్ గా స్థిరపడటం అనే ఒక అపోహ నుండి బయటపడి ఎన్నో వినూత్నమైన కోర్సులను అధ్యయనం చేస్తూ మానవాళికి అవసరమైన సహజ సిద్ధమైన ఆహార పదార్థాలను మొక్కల ద్వారా అందించడం ఒక ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో వినియోగించి విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, జీవశాస్త్ర శిక్షణా కేంద్ర ఇంచార్జ్ ఏ. పద్మలత, రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి, రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అప్పన్న హస్తంలా ఆదుకుంటుంది

*** జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అప్పన్న హస్తంలా ఆదుకుంటుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జగద్గిరిగుట్ట డివిజన్ కూన మహాలక్ష్మి నగర్ ప్రాంతానికి చెందిన జోడు సురేఖ , నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి శ్రీ సాయి నగర్ చెందిన ఎం. శాంత , ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు జోడు సురేఖ, ఎం.శాంతలకు రూ.2.70 లక్షల రూపాయలను మంజూరు చేయించగా శుక్రవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు కార్పొరేటర్ కొలుకుల జగన్, రవి కిరణ్ లు ఎల్వోసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం పనిచేసే నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిమూలం శివన్ష ను ఆశీర్వదించిన బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బిర్ల అనిత




యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి పలుగుల మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పీఆర్వో ఆదిమూలం సురేష్ శ్రావణిల కుమారుని తొట్టెల ఫంక్షన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత పాల్గొని చిన్నారుడు ఆదిమూలం శివన్ష ను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో కంచర్ల బలరాం, మూల రమేష్,బుగ్గ ఉపేందర్,ఆరని సంతోష్ ,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 25న ఉస్మానియా యూనివర్సిటీలో పకృతి ఆరోగ్య రాష్ట్ర మహాసభ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈనెల 25న ఆదివారం హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పకృతి ఆరోగ్య రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించిన అసిస్టెంట్ అకౌంటెంట్ ఆఫీసర్ ట్రాన్స్ కో కళ్లెం శ్రీనివాస్ రెడ్డి . ఈ కార్యక్రమంలో పకృతి వైద్యులు పిసివి స్వామి, టి వెంకన్న , అర్జునరావు , సుగుణరావు , జాల లింగయ్య , లింగాల వెంకన్న , వరలక్ష్మి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని డాలర్ మెడోస్ నందు గల శ్రీశ్రీశ్రీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి దయతో ప్రజలంతా సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మురళి యాదవ్, చింతా మల్లేష్, క్రిష్ణా రెడ్డి, బల్వంత్ రెడ్డి, సునీల్ కుమార్, అనంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సుదర్శన్, నరసింహ శర్మ, రామకృష్ణ, లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మధుసూదన్ రావు, బాల్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాక్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బకొట్టేందుకు భారత్ ప్రయత్నాలు

పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆవేదనతో రగిలిపోయిన భారత్.. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఉగ్ర నాగులకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్ పైనా చర్యలకు ఉపక్రమించింది. సింధు నది జలాల ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. అఖిలపక్ష సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దాయాది చర్యలను తూర్పారబడుతూ.. దౌత్య మార్గాల్లోనూ ఒత్తిడి తీసుకొస్తోంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తే ఎలాంటి చర్యలకైనా వెనకాడబోమని పాకిస్థాన్‌కు పరోక్షంగా హెచ్చరికలు పంపుతోంది. ఈ క్రమంలోనే పాక్ ఆర్థిక మార్గాలను మూసివేసి, ఆ దేశ ఆర్థిక



వ్యవస్థపైనా దెబ్బ కొట్టేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.ఈ క్రమంలోనే దాయాదికి ఆర్థిక సాయం అందించే ప్రపంచ బ్యాంక్, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎన్ఏటీఎఫ్)లను కలవాలని భారత్ యోచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ 2 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేస్తుందని పాక్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. జూన్ నెలలో వరల్డ్ బ్యాంక్ దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో పహల్గాం దాడిని ఉటంకిస్తూ.. ప్యాకేజీపై పునరాలోచించాలని ప్రపంచ బ్యాంక్‌కు విజ్ఞప్తి చేసేందుకు భారత్ సిద్ధమవుతోంది.ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న కారణంతో 2018 జూన్‌లో పాకిస్థాన్‌ను 'గ్రే జాబితా'లో చేర్చారు. దీంతో ప్రపంచ ఆర్థికసంస్థల నుంచి నిధులు మంజూరయ్యేవి కాదు. అయితే, ఉగ్రవాదం అణచివేతకు కృషి చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా.. ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న కొందరిని జైళ్లలో పెట్టడంతో.. 2022 అక్టోబర్‌లో పాక్‌ను ఆ జాబితా నుంచి తొలగించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాక్‌ను మళ్లీ గ్రే జాబితాలో చేర్చాలని ఎఫ్ఏటీఎఫ్‌పై భారత్ తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తోంది. ఒకవేళ పాక్‌ను మళ్లీ ఆ జాబితాలో చేరిస్తే.. ప్రపంచ బ్యాంకు నుంచి రావాల్సిన 2 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎమ్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌కు మే 9న 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఆర్థికసాయం మంజూరు చేసింది.

# ఏ తప్పూ చేయకుంటే నోటీసు ఇవ్వగానే ఉలుకు ఎందుకు?

**: మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్: కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిషన్ వేశామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ తప్పూ చేయకుంటే నోటీసు ఇవ్వగానే అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వగానే కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమన్న ఉత్తమ్.. ఇందిరగాంధీ లాంటి వాళ్లే కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చాక జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకే జ్యుడీషియల్ కమిషన్ వేశామన్నారు. ''బాంబులు వేశారని చెబుతున్నారు.. అప్పుడు మీరే ప్రభుత్వంలో ఉన్నారు. మేడిగడ్డపై బాంబులు వేస్తే అప్పుడు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు పేర్కొనలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును తెల్ల ఏనుగుతో పోల్చుతూ కాగ్ నివేదికలో పేర్కొంది. భారాస నేతలు జేబులు నింపుకొనేందుకు మేడిగడ్డ ప్రాజెక్టు ప్రాంతం మార్చారు.




డీపీఆర్‌లో పేర్కొన్న ప్రదేశం కాకుండా మరోచోట ప్రాజెక్టు కట్టారు. నాలుగు రెట్లు వ్యయం పెరిగిన ప్రాజెక్టుతో అదనపు ఆయకట్టు నామమాత్రంగా పెరిగింది. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు ప్రాంతం మార్చారు. కాళేశ్వరం తెల్ల ఏనుగుగా మారబోతోందని కేంద్ర సంస్థలు చెప్పాయి. భారాస ఎంపీల మద్దతుతోనే ఎన్డీఎస్ఏ చట్టం వచ్చింది. కాళేశ్వరం డీపీఆర్, రీడిజైన్, నిర్మాణంలో లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ చెప్పింది. ప్రాజెక్టును పునఃవినియోగంలోకి తేవడంపై మేం చాలా అధ్యయనం చేస్తున్నాం. ప్రాజెక్టు పునాదుల్లోనే ఎన్నో లోపాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కూలిపోయిన ప్రాజెక్టును అద్భుతమని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. జ్యుడీషియల్ కమిషన్ ముందు హాజరై వాళ్ల వాదన ఏంటో వినిపించాలి'' అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

## హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్‌ను గుర్తిస్తున్నాం : డీజీపీ జితేందర్



హైదరాబాద్: ఉగ్ర కుట్ర సూత్రధారి సమీర్ కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్‌ను గుర్తిస్తున్నామని, వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ''ఉగ్రకుట్రకు ఒక గ్రూప్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. ఏర్పాటు దశలోనే గ్రూపును కనిపెట్టి విచ్ఛిన్నం చేశాం. ఛత్తీస్‌గఢ్ ఆపరేషన్‌ను కేంద్ర బలగాలే నిర్వహించాయి. తెలంగాణలో ఇప్పటి వరకు 300 మంది మావోయిస్టులు లొంగిపోయారు. రాష్ట్రంలో మావోయిస్టులు ఇంకెవరైనా ఉంటే వెంటనే లొంగిపోవాలి'' అని డీజీపీ సూచించారు.

## తెలంగాణ పాలిసెట్ ఫలితాలు రేపే..

తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం మే 13న నిర్వహించిన పాలిసెట్ (TG Polycet) ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ పరీక్ష ఫలితాలను శనివారం (మే 24) ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలంగాణ సాంకేతిక విద్య, శిక్షణ (ఎస్‌బీటెట్) కార్యదర్శి బి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో ఈ ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పాలిసెట్



2025కు 92.64% మంది హాజరైన విషయం తెలిసిందే. దీనికి మొత్తంగా 1,06,716 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 98,858 మంది పరీక్ష రాశారు.

## అడ్డం తిరిగిన కిడ్నాప్ కథ.. కన్నతల్లే హంతకురాలు

దుబ్బాక: పేగుబంధానికి తలవంపులు తెచ్చే ఘటన ఇది. నవ మాసాలు మోసి జన్మనిచ్చిన కన్నతల్లి మానవత్వం మరిచి కర్కశంగా మారింది. 80 రోజుల పసికందును బావిలో పడేసి చంపేసింది. ఈ ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకోగా.. పసికందు మృతదేహాన్ని గురువారం వెలికి తీశారు. ఇంటి ముందు ఆడిస్తున్న పసికందును ఇద్దరు దుండగులు అపహరించారని కన్నతల్లి పోలీసులను తప్పుదోవ పట్టించింది. చివరికి విచారణలో తానే తన కన్న కొడుకును బావిలో వేసి చంపినట్లు అంగీకరించడంతో శుక్రవారం పోలీసులు ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామగళ్ళ శ్రీమాన్ నంగునూరు మండలం నర్మెట్టకు చెందిన కవితను మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని పుల్లూరులోనే నివాసం ఉంటున్నారు. శ్రీమాన్ ఇటీవల రెండు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడంతో గ్రామంలో పరువు పోయిందని, అతని అమ్మమ్మ ఊరైన అప్పనపల్లిలో గత రెండు నెలల నుంచి ఉంటున్నారు. ఎంతో



ఆనందంగా ఉంటుందనుకున్న జీవితం ప్రశ్నార్థకంగా మారడంతోపాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తరచూ వేధింపులకు గురి చేస్తుండటం, ఆర్థిక ఇబ్బందులు, భర్త ప్రవర్తన, వ్యవహార శైలి నచ్చని కవిత భర్తతో విడిపోవడానికి సిద్ధపడింది.

*** భర్త నుంచి విడిపోయి దూరంగా వెళ్లి పోవాలని..**

ఈ క్రమంలో అడ్డుగా ఉన్న పసికందును తప్పిస్తే.. భర్తను విడిచిపెట్టి హాయిగా ఉండొచ్చని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసికందు దీక్షిత్ కుమార్‌ను తీసుకెళ్లి గ్రామశివారులో ఉన్న పాడుబడిన వ్యవసాయ బావిలో విసిరేసి వెళ్లిపోయింది. తన దగ్గర నుంచి ఇద్దరు ముసుగు వేసుకొని వచ్చిన దుండగులు బాబును ఎత్తుకెళ్లారని చెప్పి, అందరిని తప్పుదోవ పట్టిస్తూ కిడ్నాప్ జరిగినట్టుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవిత చెబుతున్న విషయాలకు, జరిగిన ఘటనకు పొంతన లేకపోవడంతో ఆమెను తమదైన శైలిలో విచారించారు. భర్త నుంచి విడిపోయి దూరంగా వెళ్లిపోవాలని.. అడ్డుగా ఉన్న కుమారుడిని తానే బావిలో వేసి చంపినట్లు అంగీకరించింది. దీంతో ఆమె భర్త శ్రీమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసును హత్య కేసుగా మార్చిన పోలీసులు కవితను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా: సీఎం

పస్తాపూర్: మెదక్ అంటే ఇందిరమ్మ.. ఇందిరమ్మ అంటే మెదక్ అని, ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పస్తాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ నిలవాలని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్‌ఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. ''పటాన్‌చెరు ప్రాంతం మినీ ఇండియాలాంటిది. ఈ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రధానిగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగింది. సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా



అమలు చేశాం. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం. అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర సాయం తీసుకుంటాం. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధిని సాధించగలం. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా. ఎవరేం అనుకున్నా నాకు ఇబ్బంది లేదు. చక్కెర పరిశ్రమ కోసం సహకార సంఘం ఏర్పాటు చేసుకుంటే.. నిమ్జ్‌లో 100 ఎకరాలు కేటాయించడంతోపాటు నిధులు కూడా మంజూరు చేయిస్తా'' అని సీఎం అన్నారు.

## హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ మిల్లెట్స్ ఏర్పాటు

**: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో రూ.200 కోట్లతో గ్లోబల్ సెంటర్ ఆఫ్ మిల్లెట్స్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన



మీడియాతో మాట్లాడుతూ.. ఈ సెంటర్‌ను కేంద్ర వ్యవసాయశాఖ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. చిరుధాన్యాలపై పరిశోధన, ఉత్పత్తిలో హైదరాబాద్ కేంద్రం కీలకం కానుందన్నారు. రైల్వే రక్షణకు సంబంధించిన కవచ్ ప్రాజెక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా హైదరాబాద్‌లోనే ఏర్పాటు కానున్నట్లు మంత్రి తెలిపారు.

## రేపటి నుంచి HYD మెట్రో ఛార్జీల తగ్గింపు

హైదరాబాద్: హైదరాబాద్‌లో తగ్గించిన మెట్రో ఛార్జీలు శనివారం నుంచి అమలు చేయనున్నారు. సవరించిన మెట్రో ఛార్జీల కనీస ధర రూ.11, గరిష్ఠ ధర రూ.69. రెండు కి.మీ వరకు మెట్రో ఛార్జీని రూ.12 నుంచి రూ.11కు తగ్గించారు. 2 నుంచి 3 కి.మీ వరకు రూ.18 నుంచి రూ.17కి.. 4 నుంచి 6 కి.మీ వరకు రూ.30 నుంచి రూ.28కి తగ్గించారు. 6 నుంచి 9 కి.మీ వరకు మెట్రో ఛార్జీని రూ.40 నుంచి రూ.37కి తగ్గించారు. (Hyderabad Metro) ఇటీవల హైదరాబాద్ మెట్రో ఛార్జీలను పెంచారు. అనంతరం వీటిని తగ్గిస్తూ సవరణ చేశారు.

## జూబ్లీహిల్స్‌లో రూ.200 కోట్ల విలువైన పార్క్ స్థలాన్ని రక్షించిన హైడ్రా

హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ.200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మగుడి సమీపంలో నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. ఇంటిని అద్దెకు తీసుకొని ఆ ఇంటి యజమానికి



తెలియకుండా చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ఆక్రమించిన కబ్జాదారుడు.. హోటల్, హాస్టల్‌కు అద్దెకిచ్చి నెలకు రూ.10లక్షలు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై హైడ్రాకు ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా.. గతంలోనే కిరాయిదారుడికి నోటీసులు ఇచ్చింది. సదరు కిరాయిదారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ నిర్మాణాలపై ఎలాంటి హక్కు లేదని.. రోడ్డు, నాలాను ఆక్రమించి భవనాలు ఎలా నిర్మిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఇవాళ బుల్డోజర్లతో విరుచుకుపడి వాటిని నేలమట్టం చేసింది. ఆ ప్రదేశంలో జీహెచ్ఎంసీ చక్కటి పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

# పాక్ విమానాలకు గగనతలం నిషేధాన్ని పొడిగించిన భారత్

దిల్లీ: పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ దేశానికి చెందిన విమానాలు భారత గగనతలాన్ని వినియోగించకుండా కేంద్రం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఆ గడువు నేటితో ముగుస్తున్న వేళ నిషేధాన్ని పొడిగిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 23 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తాజాగా వెల్లడించింది. ఈ మేరకు పౌరవిమానయాన శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలతోపాటు, ఆ దేశ సైనిక విమానాలు, లీజుకు తీసుకున్న విమానాలు కూడా భారత గగనతలంలో ప్రవేశించడానికి వీల్లేదు. భారత్ విమానాలపై విధించిన నిషేధాన్ని గురువారం పాకిస్థాన్ పొడిగించిన నేపథ్యంలో భారత్ కూడా ఆ దిశగా చర్యలు చేపట్టింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ విమానాలు తమ గగనతలం వినియోగించకుండా ఏప్రిల్ 23న పాకిస్థాన్ నిషేధం విధించింది. అక్కడికి వారం రోజుల తర్వాత భారత్ కూడా పాక్ విమానాలపై నిషేధం విధించింది. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారం ఒక నెల కంటే ఎక్కువ రోజులు గగనతలం వినియోగించకుండా అడ్డుకోవడం కుదరదు. దీంతో ఇరుదేశాలూ నిషేధం గడువును పొడిగించాయి.



## పాక్ సైనిక పాలనకు మద్దతు..
## ఐరోపాపై జైశంకర్ తీవ్ర విమర్శలు



సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్ వక్రబుద్ధిని కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ విదేశాల్లో ఎండగడుతున్నారు. తాజాగా ఆయన జర్మనీ మీడియాతో మాట్లాడుతూ ఐరోపా దేశాల వైఖరిని ఆక్షేపించారు. సైనిక పాలనకు, సరిహద్దులో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోన్న పాక్‌కు మద్దతు ఇవ్వడాన్ని ఆయన ప్రశ్నించారు. ‘‘1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కశ్మీర్‌లో మా సరిహద్దుల వెంట పాక్ రెచ్చగట్టే చర్యలకు పాల్పడుతోంది. ఈ ఎనిమిది దశాబ్దాల కాలంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కలిగిన ఐరోపా దేశాలు.. పాక్ సైనిక పాలనకు మద్దతుగా నిలిచాయి. పశ్చిమ దేశాల నుంచి వచ్చిన మద్దతు ఇంకెవరి నుంచి రాలేదు’’ అని విమర్శలు చేశారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని భారత్ పలుమార్లు ఐరోపా దృష్టికి తీసుకెళ్లింది. అయినా సరే 2004లో పాక్‌ను ప్రధాన నాటోయేతర దేశంగా అమెరికా గుర్తించింది. దీనిద్వారా కీలకమైన వ్యూహాత్మక భాగస్వాములకు సైనిక, ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. ఉగ్రవాదంపై తాను చేపట్టిన పోరాటంలో భాగంగా ఈ గుర్తింపు ఇచ్చినట్లు తన చర్యను అమెరికా సమర్థించుకుంది. ఆ నిర్ణయంపై భారత్ నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిణామాలను ఉద్దేశించే జైశంకర్ తీవ్రంగా స్పందించారు. ఇంతకుముందు నెదర్లాండ్స్‌కు చెందిన మీడియాకు మంత్రి వరుస ఇంటర్వ్యూలు ఇచ్చారు. తన గడ్డపై జరుగుతోన్న ఉగ్రవాద కార్యకలాపాల గురించి పాకిస్థాన్‌కు తెలియదనే భావనను మంత్రి తీవ్రంగా ఖండించారు. పాక్, ఆ దేశ ఆర్మీ రెండూ ఉగ్రవాద కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయన్నారు. పాక్ నేతలు, మరీ ముఖ్యంగా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ మత ఛాందసవాదంపై జైశంకర్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

## తల్లి మరణించిన మరుసటి రోజే విధుల్లోకి..



సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ ఓకాకు ఆఖరి పనిదినం నాడు 11 తీర్పులు వెలువరించారు. అంతేకాదు, ముందురోజు (మే 22న) తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్న జస్టిస్ ఓకా.. మరుసటి రోజే విధుల్లో చేరి పనిపట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా మే 24న పదవీ విరమణ చేయనున్న ఆయన.. చివరి పనిదినం రోజు న్యాయమూర్తులు విధులు నిర్వర్తించకపోవడాన్ని తాను అంగీకరించనని ఇటీవల అభిప్రాయపడ్డారు. ఆరోజు మధ్యాహ్నం వరకు కాకుండా పూర్తి సమయం వరకు పనిచేయాలన్నారు. జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా 1960 మే 25న జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ బాంబే నుంచి న్యాయశాస్త్రంలో పట్టాపొందిన ఆయన.. 1983లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. తండ్రి శ్రీనివాస్ డబ్ల్యూ ఓకా వద్ద ప్రాక్టీస్ మొదలుపెట్టారు. అనంతరం వీపీ టిప్నిస్ వద్ద పనిచేసిన ఆయన.. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అనంతరం 2005, నవంబర్ 12న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2019 మే 10న బాధ్యతలు చేపట్టిన జస్టిస్ ఏఎస్ ఓకా... 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అప్పటినుంచి వివిధ ధర్మాసనాల్లో మొత్తంగా 295 తీర్పులు ఇవ్వగా.. వివిధ ధర్మాసనాల్లో వెయ్యి తీర్పుల్లో భాగస్వామ్యం పంచుకున్నారు. బెయిల్ దరఖాస్తులను ట్రయల్ కోర్టులు తిరస్కరించడంపై పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేసిన జస్టిస్ ఓకా.. కొవిడ్ సమయంలోనూ వలస కార్మికుల హక్కుల రక్షణకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం వారిపై అనుసరించిన వైఖరిని ప్రశ్నించారు.

## చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నా : మంత్రి విజయ్ షా




భోపాల్: భారత వైమానిక దళ అధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా మరోసారి క్షమాపణలు చెప్పారు. అది ‘భాషా పరమైన తప్పిదమే’ తప్ప ఏ మతాన్నీ కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఇండియన్ ఆర్మీకి, సోదరి కర్నల్ సోఫియా ఖురేషీకి, యావత్ దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతున్నట్లు ఓ వీడియోను విడుదల చేశారు. ‘‘ఇటీవల పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడి నన్ను ఎంతగానో బాధించింది. దేశంపై నాకు అపారమైన ప్రేమ, భారత ఆర్మీపై అంచంచలమైన గౌరవం ఉన్నాయి. నా వ్యాఖ్యలు ఓ సామాజిక వర్గాన్ని, మతాన్ని, దేశ ప్రజలందర్నీ బాధించాయి. అది భాషాపరంగా నేను చేసిన తప్పు. అందుకు మనస్ఫూర్తిగా చింతిస్తున్నాను. దేశ ప్రజలకు, భారత ఆర్మీకి, సోదరి కర్నల్ సోఫియాకు చేతులు జోడించి క్షమాపణ చెబుతున్నా’’ అని విజయ్ షా ఆ వీడియోలో పేర్కొన్నారు. విజయ్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికిన సంగతి తెలిసిందే. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిని సవాల్ చేస్తూ.. ఇటీవల మంత్రి సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. సర్వోన్నత న్యాయస్థానం సైతం ఆయనపై తీరును ఆక్షేపించింది. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి అభ్యంతరం ఏంటని నిలదీసింది. ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని ఆదేశించింది. ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన ధర్మాసనం.. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.



## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?
## ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీం

రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇవి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది. ఐఐటీ ఖరగ్‌పుర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులను తేలికగా తీసుకోవద్దని, చాలా తీవ్రత కలిగిన అంశాలని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు సంబంధించి మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ త్వరగా నమోదుచేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పోలీసు అధికారి, ఐఐటీ ఖరగ్‌పుర్ తరఫు న్యాయవాది ఇచ్చిన వివరణలపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. కోటాలో నీట్‌కు సన్నద్ధమవుతోన్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని, ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని నిలదీసింది. సంబంధిత పోలీసు అధికారి విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు ఆదేశాలను ఆయన పాటించలేదని పేర్కొంది. దీనిపై జులై 14 సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీచేసింది. ‘‘రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారు? కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదు? అని రాజస్థాన్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు న్యాయవాది బదులిస్తూ.. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT) ఏర్పాటు చేశామని చెప్పారు.

## పాక్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బకొట్టేందుకు భారత్ ప్రయత్నాలు



పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆవేదనతో రగిలిపోయిన భారత్.. ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాక్ లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఉగ్ర నాగులకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్ పైనా చర్యలకు ఉపక్రమించింది. సింధు నది జలాల ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. అఖిలపక్ష సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దాయాది చర్యలను తూర్పారబడుతూ.. దౌత్య మార్గాల్లోనూ ఒత్తిడి తీసుకొస్తోంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తే ఎలాంటి చర్యలకైనా వెనకాడబోమని పాకిస్థాన్‌కు పరోక్షంగా హెచ్చరికలు పంపుతోంది. ఈ క్రమంలోనే పాక్ ఆర్థిక మార్గాలను మూసివేసి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థపైనా దెబ్బ కొట్టేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే దాయాదికి ఆర్థిక సాయం అందించే ప్రపంచ బ్యాంక్, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)లను కలవాలని భారత్ యోచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ 2 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేస్తుందని పాక్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. జూన్ నెలలో వరల్డ్ బ్యాంక్ దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో పహల్గాం దాడిని ఉటంకిస్తూ.. ప్యాకేజీపై పునరాలోచించాలని ప్రపంచ బ్యాంక్‌కు విజ్ఞప్తి చేసేందుకు భారత్ సిద్ధమవుతోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న కారణంతో 2018 జూన్‌లో పాకిస్థాన్‌ను ‘గ్రే జాబితా’లో చేర్చారు. దీంతో ప్రపంచ ఆర్థికసంస్థల నుంచి నిధులు మంజూరయ్యేవి కాదు. అయితే, ఉగ్రవాదం అణచివేతకు కృషి చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా.. ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న కొందరిని జైళ్లలో పెట్టడంతో.. 2022 అక్టోబర్‌లో పాక్‌ను ఆ జాబితా నుంచి తొలగించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాక్‌ను మళ్లీ గ్రే జాబితాలో చేర్చాలని ఎఫ్ఏటీఎఫ్‌పై భారత్ తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తోంది. ఒకవేళ పాక్‌ను మళ్లీ ఆ జాబితాలో చేరిస్తే.. ప్రపంచ బ్యాంకు నుంచి రావాల్సిన 2 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎమ్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌కు మే 9న 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఆర్థికసాయం మంజూరు చేసింది. దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది.

## గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

గడ్చిరోలి: మహారాష్ట్రఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీస్ స్పెషల్ కమాండో యూనిట్ సీ 60, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గడ్చిరోలి జిల్లాలో ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కవండే ప్రాంతంలో ఇటీవల ప్రారంభించిన ఫార్వార్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌వోబీ) సమీపంలో మావోయిస్టులు ఉన్నట్లు అందిన సమాచారం ఆధారంగా గురువారం మధ్యాహ్నం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. భారీ వర్షం మధ్య దాదాపు 300 మంది సీ60 కమాండోలు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించారని.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు.





# పాత కానే కాదు... బెయిజ్!



'ఇదొక రంగా? బ్లీచింగ్‌కీ, డ్రై చేయించడానికీ డబ్బుల్లేనివారు వేసుకుంటారు. పేదరికానికి గుర్తు' ఒకప్పుడు బెయిజ్ గురించి ఇలాగే మాట్లాడేవారట. ముతక వస్త్రం వర్ణాన్నే పోలి ఉంటుందీ రంగు. అందుకే వేసుకోవడానికీ ఇష్టపడేవారు కాదు. కానీ ఇప్పుడు... దీన్నే సంపదకీ, శ్రేయస్సుకీ ముఖ్యంగా స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. ఎంత తేడానో కదా! కాస్త గోధుమ రంగు... లేదు లేదూ ఇసుకను పోలి ఉంటుంది... అబ్బే బంగారు వర్ణంలా ఉంటుందండీ... ఒక్కొక్కరూ దీన్ని ఒక్కోలా వర్ణిస్తారు. నిజమే తెలుపు, పసుపు మధ్యలో చాలా షేడ్‌లలో ఉంటుందిది. అయితే స్వచ్ఛతకు గుర్తుగా మనసుకు ప్రశాంతతని ఇచ్చే రంగుగా తెలుపును చెబుతారు. కానీ... బెయిజ్ ఇచ్చే మెసేజ్ అంతకు మించి. అమ్మ ఒడి, ఆత్మీయుల ఆలింగనంలో ఉండే వెచ్చదనం దీని సొంతం అంటారు ఫ్యాషనిస్టులు. అందుకే దీనికి ఫ్యాషన్ ప్రపంచంలోనే కాదు, ఇంటీరియర్ రంగంలోనూ ఆదరణ ఎక్కువే. పైగా ఏ రంగులతోనైనా ఇట్టే మిళితమవుతుంది. ఏది వేసుకోవాలి, నాకు నప్పుతుందా అన్న ఒత్తిడి అస్సలే ఇవ్వదు. కోట్, షర్ట్, కుర్తీ, లెహెంగా, చీర... ఏ రూపంలో వేసుకున్నా ఇది ఇచ్చే వైబే వేరు. పైగా టైమ్‌లెస్ కలర్‌గా పేరు. అందుకే డిజైనర్లు ఎక్కువ ఎంచుకునేదీ బెయిజ్‌నే. గమనించారో లేదో ఈసారి నవ వధువుల దగ్గర్నుంచి హీరోయిన్ల వరకూ మనసు పారేసుకుంటున్నదీ ఈ రంగుపైనే. కాబట్టే, ఈ ఏడాది రంగు మోకా మూస్‌ను వెనక్కి నెట్టిమరీ బెయిజ్ ట్రెండ్ అవుతోంది. ముదురు రంగులేవైనా వచ్చి పోతుంటాయి. బెయిజ్ ఎప్పుడూ క్లాసిక్కే అన్న పొగడ్తలూ అందుకుంటోంది. మనసుకు విశ్రాంతి, సురక్షిత భావన కలిగించడం... పైగా ఎల్లప్పుడూ ఇచ్చే ట్రెండీ లుక్ దీని సొంతం. అందరూ మనసు పారేసుకుంటున్నదీ అందుకే. మరి మీ దగ్గరుందా బెయిజ్? ఏ డ్రెస్ రూపంలో?





# మామిడి పండ్లు తినేముందు!

**మామిడి పండ్లను చూస్తే క్షణమైనా ఆగలేం.. వాటి రుచిని ఆస్వాదించే దాకా మనసు మనసులో ఉండదు. అయితే ఆ ఆతృతే వద్దంటున్నారు నిపుణులు. ఈ పండ్లను తినే ముందు కాసేపు నీళ్లలో నానబెట్టడం మంచిదంటున్నారు.**



*** ఎంతసేపు నానబెట్టాలి?**

'ఎ', 'సి', 'ఇ', 'కె', 'బి6' విటమిన్లతో పాటు ఫోలేట్.. వంటి పోషకాలు మిళితమై ఉన్న మామిడి పండ్లు రుచిలోనే కాదు.. ఆరోగ్యాన్ని అందించడంలోనూ మిన్నే! ముఖ్యంగా చర్మం, జుట్టు సంరక్షణ విషయాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రయోజనాలన్నీ చేకూరాలంటే తినే ముందు వాటిని 12 గంటల పాటు నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు. ఒకవేళ వెంటనే తినాలనుకునే వారు కనీసం పావుగంట పాటైనా నీటిలో నానబెట్టాలట!

**వేడి చేయకుండా..**

వేసవిలో తప్ప ఇతర సీజన్లలో దొరకవని కొంతమంది అమితంగా వీటిని లాగించేస్తుంటారు. దీనివల్ల కొంతమంది శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తవుతుంది. అయితే తినే ముందు మామిడి పండ్లను నీళ్లలో నానబెడితే.. తద్వారా పండ్ల నుంచి శరీరంలో వేడి ఉత్పత్తి చేసే గుణాలు తొలగిపోతాయంటున్నారు నిపుణులు.



*** రసాయనాలు తొలగాలంటే..**

మామిడి పండ్లు త్వరగా పండడానికి వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇలా వాడిన రసాయనాల ప్రభావం పండు తొక్క పైన ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో వాటిని ఆదరాబాదరాగా శుభ్రం చేసుకొని తీసుకుంటే.. ఆరోగ్యానికి ప్రమాదం! తినే ముందు మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు నిపుణులు.

## నష్టాల నుంచి బయటపడ్డ మార్కెట్లు..

## 769 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. గురువారం భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు శుక్రవారం భారీగా పెరిగాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గడం కలిసివచ్చింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు రాణించడంతో మార్కెట్లు భారీగా పెరిగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 80,897.00 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,897.00 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 81,905.17 పాయింట్లు పెరిగింది.

చివరకు 769.09 పాయింట్లు పెరిగి.. 81,721.08 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 243.45 పాయింట్లు లాభపడి.. 24,853.15 వద్ద ముగిసింది. ఎటర్నల్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్, నెస్లే, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ట్రెండ్ లాభాల్లో ముగిశాయి. ఇక సన్‌ఫార్మా, గ్రాసిమ్ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.6 శాతం, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ ఐటీ ఒక్కొక్కటి ఒకశాతం పెరిగాయి. బ్యాంక్ 0.8 శాతం, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, 0.7 శాతం నుంచి 0.5 శాతం వరకు పెరిగాయి. ఫార్మా మాత్రమే 0.4 శాతం పడిపోయింది.

## బంగారం ధర మళ్లీ పెరిగింది..

**భారీగా తగ్గిన వెండి..!**



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు మగువలకు షాక్ ఇస్తున్నాయి. మొన్నటి వరకు రికార్డు స్థాయికి పెరిగిన ధరలు ఇటీవల కాస్త తగ్గుముఖం పట్టడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా మళ్లీ ధరలు పెరుగుతుండడంతో కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం వరుసగా మూడోరోజు ధరలు పెరిగాయి. ప్రపంచ మార్కెట్‌లో బలమైన ట్రెండ్ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.100 పెరిగి తులానికి రూ.98,750కి చేరింది. ఇక 22 క్యారెట్ల పసిడి ధర సైతం రూ.100 పెరిగి తులానికి రూ.98,300కి పెరిగింది.

మరో వైపు ఎండి ధర కొనుగోలుదారులకు భారీ ఊరటనిచ్చింది. శుక్రవారం ఒకే రోజు ధర రూ.2వేలు తగ్గింది. కిలోకు రూ.99,200కి పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్లలో బలమైన డిమాండ్ మధ్య అమెరికా ఆర్థిక విధానం విషయంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దాంతో బులియన్ ధరల దీర్ఘకాలిక డిమాండ్‌కు మద్దతు లభిస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 22 క్యారెట్ల పసిడి రూ.89,400కి తగ్గింది. 24 క్యారెట్ల రూ.97,530 వద్ద కొనసాగుతున్నది. ఇక వెండి కిలో ధర రూ.1.11లక్షలు పలుకుతున్నది.

## ఈ టాటా నుంచి మరో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్..

**ఈ వాహనాలకు గట్టి పోటీ!**




**న్యూఢిల్లీ:** టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ లాంచ్ అయింది. ఈ వాహనం 2020 లో కస్టమర్ల కోసం ప్రారంభించింది. ఇప్పుడు ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ దాని మొదటి ప్రధాన అప్‌డేట్‌తో వస్తోంది. కొత్త ఆల్ట్రోజ్ కొత్త డిజైన్, కొత్త ఫీచర్లతో ప్రారంభించింది. ఈ కారులో స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, అకంప్లిష్డ్ ఎస్ మరియు అకంప్లిష్డ్ ప్లస్ ఎస్ అనే ఐదు వేరియంట్లు విడుదలయ్యాయి.

### టాటా ఆల్ట్రోజ్ 2025 ఫేస్‌లిఫ్ట్ ఫీచర్లు:

భద్రత కోసం టాటా మోటార్స్ నుండి వచ్చిన ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో 6 ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, సీట్ బెల్ట్ రిమైండర్‌తో కూడిన 3 పాయింట్ల వంటి ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. దీనితో పాటు, ఈ కారులో స్మార్ట్ డిజిటల్ స్టీరింగ్ వీల్, రిమోట్ కీలెస్ ఎంట్రీ, ఆల్ డోర్ పవర్ విండోస్, మల్టీ డ్రైవ్ మోడ్‌లు, ఐడిల్ స్టార్ట్/స్టాప్ వంటి ఫీచర్లను కంపెనీ అందించింది.

12.8 సెకన్లలో 0 నుండి 100 కి వేగవంతం అయ్యే కొత్త టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్, 200%చీఎ% టార్క్ ఉత్పత్తి చేసే 1.2-లీటర్ రెవోట్రాన్ పెట్రోల్ ఇంజిన్‌తో శక్తిని పొందుతుంది. ఈ కారును 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఆటోమేటిక్ 6 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో కొనుగోలు చేయవచ్చు. 5 రంగుల ఎంపికలలో ప్రారంభించిన కొత్త టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో 345 లీటర్ల బూట్ స్పేస్ ఉంటుంది. అయితే వేరియంట్ 210 లీటర్ల బూట్ స్పేస్ కలిగి ఉంటుంది.

### ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్:

ఇప్పుడు ఆల్ట్రోజ్ కొత్త ఫ్రంట్ గ్రిల్, కొత్త ఫ్రంట్ బంపర్, డ్యూయల్ టోన్ 16 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఫ్లష్ డోర్ హ్యాండిల్స్ (సెగ్మెంట్‌లో మొదటిది) తో అందుబాటులో ఉంటుంది. ఈ కారులో జంట 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, నావిగేషన్ మ్యాప్ వ్యూతో కూడిన డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంటాయి. దీనితో పాటు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లే, క్లైమేట్ కంట్రోల్, క్రూయిజ్ కంట్రోల్, ఎయిర్ ప్యూరిఫైయర్, రియర్ వెంట్స్, కొత్తగా రూపొందించిన సీట్లు అందుబాటులో ఉంటాయి.

టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ ప్రారంభ ధర రూ. 6 లక్షల 89 వేలు (ఎక్స్-షోరూమ్). మీరు ఈ కారు టాప్ మోడల్‌ను కొనుగోలు చేస్తే మీరు రూ. 11 లక్షల 29 వేలు (ఎక్స్-షోరూమ్) ఖర్చు చేయాల్సి ఉంటుంది.

బుకింగ్, డెలివరీ తేదీ: కొత్త ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ కోసం బుకింగ్‌లు వచ్చే నెల జూన్ 2 నుండి ప్రారంభమవుతాయి. అయితే వాహనం డెలివరీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై కంపెనీ ఇంకా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఈ ధరల శ్రేణిలో ఈ కారు మారుతి సుజుకి బాలెనో, హ్యుందాయ్ టయోటా గ్లాంజా వంటి కార్లకు గట్టి పోటీనిస్తుంది.



# సన్ రైజర్స్ ప్రతీకార విజయం



**రెచ్చిపోయిన ఇషాన్, సాల్ట్ పోరాటం వృథా..**

**ఆర్సీబీ ఘోర పరాజయం**

**లక్నో:** సన్ రైజర్స్ హైదరాబాద్.. కీలకద దశలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును దెబ్బకొట్టింది. క్వాలిఫయర్ 1కి అర్హత సాధించేందుకు తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో ఆర్సీబీకి చుక్కలు చూపించింది. లక్నోలో జరిగిన ఈ మ్యాచ్ లో 42 పరుగులతో ఆరెంజ్ ఆర్మీ విజయం సాధించింది. దీంతో ఈ సీజన్ లో ఐదో విజయాన్ని సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 231 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ మెరుపు అర్ధ సెంచరీ (48 బంతుల్లో 94 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్సర్లు)తో త్రుటిలో సెంచరీని మిస్సయ్యాడు. బౌలర్లలో రొమారియో షెఫర్డ్ రెండు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం ఛేజింగ్ లో19.5 ఓవర్లలో ఆర్సీబీ.. 189 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ సూపర్ ఫిఫ్టీ (32 బంతుల్లో 62, 4 ఫోర్లు, 5 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ మూడు వికెట్లతో సత్తా చాటాడు.

### వన్ మ్యాన్ షో..

తొలి మ్యాచ్ లో సెంచరీ తర్వాత ఆ తరహా ఆటతీరును ప్రదర్శించడంలో విఫలమైన ఇషాన్ కిషన్.. ఈ మ్యాచ్ లో జూలు విదిల్చాడు. భారీ అర్ధ సెంచరీతో వన్ మేన్ షో చూపించాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన మరోసారి అదిరే ఆరంభం దక్కింది. గత మ్యాచ్ కు దూరమైన ట్రావిస్ హెడ్ (17) ఈ మ్యాచ్ లో ఆడినా, సత్తా చాటలేక పోయాడు. మరో ఎండ్ లో మాత్రం అభిషేక్ శర్మ (17 బంతుల్లో 34, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆర్సీబీ బౌలర్లను ఉతికారేశాడు. తన జోరుతో నాలుగు ఓవర్లలోనే 54 పరుగులను సన్ సాధించింది. అయితే ఓపెనర్లిద్దరూ ఒకేసారి ఔటయ్యాక.. హెన్రిచ్ క్లాసెన్ (24) తో కలిసి ఇషాన్ కిషన్ మంచి భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులెత్తింది. వీరిద్దరూ మూడో వికెట్ కు 48 పరుగులు జోడించడంతో ఇన్నింగ్స్ కుదుట పడింది. క్లాసెన్ ఔటైన తర్వాత ఇషాన్ మరింత జోరుతో బ్యాటింగ్ చేశాడు. అనికేత్ వర్మ (9 బంతుల్లో 26) వేగంగా ఆడాడు. అయితే వన్ డౌన్ లో బ్యాటింగ్ కు దిగిన ఇషాన్.. 28 బంతుల్లో ఫిఫ్టీ చేసి, చివరి కంటా నిలిచి జట్టుకు భారీ స్కోరు అందించాడు. నితీశ్ (4) విఫలమైనా, అభినవ్ మనోహర్ (12) పాట్ కమిన్స్ (13 నాటౌట్) ఫర్వాలేదనిపించారు.

### సూపర్ భాగస్వామ్యం..

భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ (43), సాల్ట్ సూపర్ పార్ట్నర్ షిప్ నెలకొల్పారు. ఆరంభం నుంచే దూకుడుగా వీరిద్దరూ ఆడటంతో ఓవర్ కు 12 పరుగులకు పరుగులు సాధించారు. ముఖ్యంగా కోహ్లీ, సాల్ట్ ఒకరికి మించి మరొకరు బౌలర్లను చితకబాదడంతో పవర్ ప్లే ముగిసేసరికి ఆర్సీబీ 72 పరుగులు సాధించింది. ఆ తర్వాత కోహ్లీ ఔటవడంతో తొలి వికెట్ కు నమోదైన 80 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత ఒక ఎండ్ లో సాల్ట్ దూకుడుగా ఆడగా, మరో ఎండ్ లో ఆర్సీబీ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా మిడిలార్డర్ విఫలం కావడంతో ఆర్సీబీకి ఓటమి తప్పలేదు. 27 బంతుల్లో ఫిఫ్టీ చేసిన సాల్ట్ కూడా వెనుదిరగడంతో ఆర్సీబీకి పరాజయం ఖాయమైంది. హిట్టర్లు కెప్టెన్ రజత్ పతిదార్ (18), జితేశ్ శర్మ (24), షెఫర్డ్ డకౌట్, టిమ్ డేవిడ్ (1),క్రునాల్ పాండ్యా (8) విఫలం కావడం జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. మిగతా బౌలర్లలో ఇషాన్ మలింగాకు రెండు వికెట్లు దక్కాయి. ఈ ఫలితంతో టాప్ ప్లేస్ కు చేరాలనే ఆర్సీబీ ఆశలు ఆవిరయ్యాయి. మరో మ్యాచ్ లో విజయం సాధిస్తేనే టాప్-2లో నిలబడి, క్వాలిఫయర్ 1కి అర్హత సాధిస్తుంది. మరోవైపు ఈ మ్యాచ్ లో ఘోర పరాజయం పాలవ్వడంతో రన్ రేట్ పడిపోయి, ఆర్సీబీకి మూడో స్థానానికి దిగజారింది.

## ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన ఇంగ్లండ్..

## పోరాడుతున్న జింబాబ్వే..!

**నాటింగ్‌హమ్:** నాటింగ్‌హమ్ వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇంగ్లండ్ పటిష్టమైన స్థితిలో నిలిచింది. ఏకంగా ముగ్గురు శతకాలతో రెచ్చిపోవడంతో తొలి రోజే భారీ స్కోర్ చేసిన ఆతిథ్య జట్టు.. శుక్రవారం లంచ్‌కు ముందు ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్ ఔట్ కాగానే కెప్టెన్ బెన్ స్టోక్స్ 565-5 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే లంచ్ సమయానికి వికెట్ నష్టానికి 73 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(36 నాటౌట్), కెప్టెన్ క్రెగ్ ఇర్విన్ (30 నాటౌట్) మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడుతున్నారు. ఇంకా జింబాబ్వే 492 పరుగులు వెనకబడి ఉంది.



### 'బజ్ బల్'ను రుచి చూపిస్తూ..

భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు సన్నాహకాల్లో ఉన్న ఇంగ్లండ్ జట్టు అదరగొడుతోంది. సొంతగడ్డపై జింబాబ్వే బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ఏకంగా ముగ్గురు సెంచరీలతో కదం తొక్కిన మ్యాచ్‌లో స్టోక్స్ సేన పట్టుబిగించింది. 22 ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ గడ్డ మీద ఆడుతున్న జింబాబ్వే డ్రా కోసం పోరాడుతోంది. ఓపెనర్లు జాక్ క్రాలే(124), బెన్ డకెట్(140)లు పర్యాటక జట్టు బౌలర్లకు 'బజ్ బల్' ఆటను రుచి చూపిస్తూ శతక గర్జన చేయగా.. మాజీ సారథి ఓలీ పోప్ సైతం బౌండరీల మోత మోగించి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. దాంతో, తొలి రోజే ఇంగ్లండ్ 500 పరుగులకు చేరువైంది.

శుక్రవారం 493-3తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ లంచ్ లోపే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తొలి సెషన్‌లో జింబాబ్వే బౌలర్లపై ఆధిపత్యం చెలాయించిన పోప్ 117 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అనంతరం వచ్చిన స్టోక్స్(9)ను ఔట్ చేసిన బ్లెస్సింగ్ ముజరబని.. అర్థ శతకంతో జోరు మీదున్న హ్యారీ బ్రూక్(58)ను బౌల్డ్ చేశాడు. బ్రూక్ ఔటైన వెంటనే స్టోక్స్ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. వికెట్ కీపర్ జేమీ స్మిత్ 4 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ స్క్వాడ్‌కు ఎంపికైన ముజరబని 143 రన్స్ ఇచ్చి 3 వికెట్లు తీశాడు.

## యువ షూటర్ అద్రియాన్‌కు కాంస్యం

**టాప్‌లోనే భారత్**

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల పతకాల పంట పండిస్తున్నారు. శుక్రవారం యువ షూటర్ విభాగంలో రజత పతకం గెలుపొందిన విషయం తెలిసిందే.

శుక్రవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో అద్రియాన్ అదరగొట్టాడు. 41వ షాట్‌లో 10.8, 42వ షాట్‌లో 10.6



అద్రియాన్ కర్మాకర్ కాంస్యంతో గర్జించాడు. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లోకి కంచు మోత మోగించి రెండో మెడల్ ఖాతాలో వేసుకున్నాడు. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీ పడుతున్న ఈ కుర్ర షూటర్ గురువారం 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు. అద్రియాన్ కాంస్యంతో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానం నిలబెట్టుకుంది. మహిళల త్రీపిస్టల్ విభాగంలో 17 ఏళ్ల అనౌష్క తోకుర్ 7వ స్థానంతో సరిపెట్టుకుంది.

## పతక వేటలో పైపైకి..

# సెమీఫైనల్లో శ్రీకాంత్

**మలేషియా:** ప్రతిష్ఠాత్మక మలేషియా మాస్టర్స్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ పతకానికి మరింత చేరువయ్యాడు. తనకంటే మెరుగైన ర్యాంకర్లకు చెక్ పెడుతూ వస్తున్న భారత షట్లర్.. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జయకేతనం ఎగురవేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన తొమా జూనియర్ పొపోవ్‌ను మట్టికరిపిస్తూ సెమీస్‌కు దూసుకెళ్లాడీ ఈ మాజీ వరల్డ్ నంబర్ 1. దాంతో, ఏడాది తర్వాత అతడు ఒక టోర్నీలో సెమీఫైనల్ ఆడబోతున్నాడు.



పస్తుతం 65వ ర్యాంక్‌లో కొనసాగుతున్న శ్రీకాంత్ సంచలన ఆటతో వరుసపెట్టి ప్రత్యర్థులకు చెక్ పెడుతున్నాడు. ప్రీ- క్వార్టర్స్‌లో ఆరో సీడ్‌ను చిత్తు చేసిన అతడు .. ఈసారి 18వ ర్యాంకర్‌ను ఇంటిదారి పట్టించాడు. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ పట్టు విడవలేదు. తొలి సెట్ తర్వాత ప్రత్యర్థి పుంజుకున్నా తన పోరాట పటిమతో ఆకట్టుకున్న భారత స్టార్ చివరకు 24-22, 17-21, 221-20తో విజేతగా నిలిచాడు. తదుపరి రౌండ్‌లో శ్రీకాంత్‌కు జపాన్‌కు చెందిన యుషీ తనక రూపంలో కఠినమైన సవాల్ ఎదురుకానుంది.

పురుషుల సింగిల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన భారత కుర్రాళ్లు హెచ్ఎస్ ప్రణయ్, ఆయుశ్ శెట్టి, కరుణాకరన్‌లు ఇంటిదారి పట్టిన విషయం తెలిసిందే. ఇక మహిళల 16వ రౌండ్ డబుల్స్ మ్యాచ్‌లో ప్రేరణా అల్వేకర్, మృణ్మయి దేశ్‌పాండే ద్వయం పోరాటం ముగియగా.. ఒలింపిక్ విజేత పీవీ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.



# కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య ప్రత్యేకం

టాకీస్: కేన్స్ ఫిలం ఫెస్టివల్‌లో అందాల రాశి ఐశ్వర్యారాయ్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. 22వ సారి కేన్స్ వేడుకలకు హాజరయ్యారు ఐశ్వర్యారాయ్... మొదటిరోజు హాఫ్ వైట్ శారీలో భారతీయత ఉట్టిపడేలా రాయల్ లుక్‌లో కనిపించింది. రెండో రోజూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. మోడ్రన్ దుస్తులు ధరించినప్పటికీ భారతీయ సంస్కృతి సంప్రదాయలకు విలువనిచ్చారు. తన డ్రెస్‌పై భగవద్గీత శ్లోకంతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఫొటోలు షేర్ చేశారు. 'ఐశ్వర్య ధరించిన డ్రెస్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఆ బనారసీ కేప్‌పై 'భగవద్గీతలోని 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే శ్లోకాన్ని చేతితో సంస్కృతంలో ఎంబ్రాయిడరీ చేశారు' అని తెలిపారు. దీంతో ఈరోజు ఐశ్వర్య ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను, భగవంతుడు అందించిన అమూల్య సంపద భగవద్గీత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఐశ్వర్య రెండోరోజు లుక్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే భగవద్గీతకు ఇటీవల యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఐశ్వర్య ప్రపంచానికి చాటిచెప్పడం కోసం ఈ డ్రెస్ ధరించి ఉంటారని అభిప్రాయపడుతున్నారు. తొలిరోజు కూడా ఈ కేన్స్ క్వీన్ తన లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. కొన్నేళ్లుగా కేన్స్‌లో మెరుస్తున్న ఈ భామ ఈసారి భారతీయత ఉట్టిపడేలా.. చీరకట్టుతో నుదుటిన సిందూరం పెట్టుకొని సినీప్రియుల దృష్టిని ఆకట్టుకున్నారు.



## డైరెక్టర్ బాబీకి చిరు కానుక

టాకీస్: మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీకి ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. చిరంజీవికి స్వయంగా ఫ్యాన్ అయిన బాబీ.. ఫ్యాన్ బాయ్ సినిమా అంటూ గతంలో చిరుతో వాల్తేరు వీరయ్య మూవీ తీసి మంచి హిట్ ఇచ్చాడు. అప్పటి నుంచి ఇద్దరి నడుమ మంచి సాన్నిహిత్యం కొనసాగుతోంది. త్వరలోనే చిరుతో మరో మూవీ తీసేందుకు కూడా రెడీ అవుతున్నాడు. ఈ క్రమంలోనే చిరంజీవి డైరెక్టర్ బాబీకి ఖరీదైన గిఫ్ట్ ఇచ్చాడు. తాజాగా ఆ ఫొటోలను పంచుకున్నాడు బాబీ. చిరంజీవి ఖరీదైన వాచ్‌ను బాబీకి గిఫ్ట్ ఇచ్చాడు. దీనిపై బాబీ స్పెషల్ ట్వీట్ చేశాడు. 'చిరంజీవి గారి నుంచి నాకు మెగా సర్ ప్రైజ్ వచ్చింది. ఈ బహుబతికి అస్సలు వెలకట్టలేను. థాంక్యూ అన్నయ్య. ఈ గిఫ్ట్ ను ఎప్పటికీ గుర్తుంచుకుంటా' అంటూ రాసుకొచ్చాడు బాబీ. ఈ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చిరంజీవి గతంలో చాలా మందికి ఇలాంటి గిఫ్ట్ లు ఇచ్చారు. ఇంటికి పిలిచి భోజనాలు పెట్టి వారిని ఎంకరేజ్ చేస్తుంటారు. ఇప్పుడు బాబీకి కూడా అలాంటి గిఫ్ట్ తో ఎంకరేజ్ చేశారని ఆయన ఫ్యాన్స్ అంటున్నారు.




## కుర్ర హీరోయిన్స్‌కు గట్టి పోటీ ఇస్తున్న త్రిష..

టాకీస్: సౌత్ ఇండస్ట్రీలో తోపు హీరోయిన్. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా అందం, అభినయంతో సినీ పరిశ్రమను ఏలేస్తోంది. తెలుగుతోపాటు తమిళం, మలయాళం భాషలలో బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంటూ ఇప్పటికీ టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతుంది. ఇటీవలే పొన్నియిన్ సెల్వన్, లియో వంటి హిట్స్ తర్వాత త్రిష క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పుడు అజిత్ సరసన విడాముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రాలతో మరిన్ని హిట్స్ ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. 'జోడి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించిన తర్వాత మౌనం పెసియాదే మూవీతో హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. తక్కువ సమయంలోనే పాన్ ఇండియా లెవల్లో తనదైన ముద్ర వేసింది. ఇప్పుడు దక్షిణ భారతదేశంలో అత్యంత డిమాండ్ ఉన్న నటిగా, అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్ గా మారింది. ప్రస్తుతం త్రిష కమల్ హాసన్ సరసన థగ్ లైఫ్ సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాకు మణిరత్నం దర్శకత్వం వహిస్తున్నారు. 42 ఏళ్ల వయసులోనూ ఈ ముద్దుగుమ్మ కుర్ర హీరోయిన్స్‌కు గట్టిపోటీ ఇస్తుంది.



# రాజమౌళితో మహేశ్ మూవీ


### తదుపరి ఎవరంటూ అప్పడే ఊహాగానాలు





టాకీస్: 'సూపర్ స్టార్' మహేష్ బాబు ప్రస్తుతం ఎస్ఎస్ రాజామౌళి దర్శకత్వంలో ఎస్ఎస్ఎంబీ 29 చేస్తున్న సంగతి తెలిసిందే. హాలీవుడ్ రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే మొదలైంది. కొన్ని కీలక షెడ్యూల్స్ పూర్తి చేశాడు జక్కన్న. కానీ ఈ సినిమా ఎప్పుడు కంప్లీట్ అవుతుంది, అసలు షూటింగ్ ఎంతవరకు వచ్చిందనే విషయంలో అఫీషియల్ కన్ఫర్మేషన్ లేదు. కానీ మహేష్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 30 ఎవరితో చేయబోతున్నాడనే చర్చ మాత్రం జరుగుతోంది. ఎస్ఎస్ఎంబీ 29 రిలీజ్ అయ్యాక మహేష్ బాబుకి హాలీవుడ్ రేంజ్ స్టార్ డమ్ రావడం పక్కా. కాబట్టి నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను అంత ఈజీగా తీసుకునే ఛాన్స్ ఉండదు. ఖచ్చితంగా ఎస్ఎస్ఎంబీ 30 అంతకుమించి అనేలా ప్లాన్ చేయడం గ్యారెంటీ. మరి ఆఫ్టర్ ఎస్ఎస్ఎంబీ 29ని, మహేష్ బాబుని హ్యాండిల్ చేసే దర్శకుడు ఎవరంటే.. ఇద్దరు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. లేటెస్ట్ ట్రెండ్ ప్రకారం.. ఇద్దరిలో ఎవరో ఒకరు ఫైనల్ అయ్యేలా కనిపిస్తున్నారు. పుష్ప సినిమాతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను షేక్ చేసి, రాజమౌళి రికార్డ్ బ్రేక్ చేసిన సుకుమార్ మరోసారి మహేష్‌తో వర్క్ చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. వన్ నేనొక్కడినే సినిమాతో మహేష్ బాబుకి హిట్ ఇవ్వలేకపోయిన సుకుమార్.. ఈసారి ఆ ఛాన్స్‌ను వదులుకునేలా లేదు. కాబట్టి.. రాజమౌళి సినిమా తర్వాత సుకుమార్ సినిమా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ, మహేష్ బాబుతో సినిమా చేయడానికి ఎప్పటి నుంచో ప్రయత్నాల్లో ఉన్నాడు. ఆ మధ్య ఓ స్టోరీ లైన్ కూడా వినిపించినట్టుగా టాక్ వచ్చింది. ప్రస్తుతం ప్రభాస్‌తో స్పిరిట్ చేస్తున్న సందీప్.. ఆ తర్వాత రణబీర్ కపూర్‌తో యానిమల్ పార్క్ చేయనున్నాడు. కాబట్టి ఎస్ఎస్ఎంబీ 30 సందీప్ చేసే ఛాన్స్ లేకపోలేదు. మొత్తంగా.. సుకుమార్, సందీప్ రెడ్డిలలో ఎవరో ఒకరు మహేష్ నెక్స్ట్ ప్రాజెక్ట్ టేకప్ చేసేలా ఉన్నారనే చెప్పాలి. ఈ ఇద్దరు డైరెక్టర్లు చేసిన చివరి సినిమాలు పాన్ ఇండియా లెవల్లో హిట్ కొట్టాయి. కాబట్టి ఎవరు చేసినా పర్లేదు అని మహేష్ ఫాన్స్ అంటున్నారు.

# 'ఘటికాచలం' ట్రైలర్ విడుదల




టాకీస్: నిఖిల్ దేవాదుల కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఘటికాచలం'. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు అమర్ కామెపల్లి దర్శకత్వం వహిస్తుండగా.. ఎం.సి.రాజు నిర్మించారు. ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగి నాయుడు, సంజయ్ రాయ్ చుర, దుర్గాదేవి వంటి తారలు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. ఇటీవల షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది.

ఈ ట్రైలర్ చూస్తుంటే.. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా, నిఖిల్ దేవాదుల నటన, ఆయన పలికిన డైలాగ్స్ సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ప్రముఖ నిర్మాత ఎస్.కె.ఎన్. మరియు స్టార్ డైరెక్టర్ మారుతి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తుండటం విశేషం.

## జూన్ 6న రాబోతున్న సంగీత్ శోభన్ మిస్టరీ ఎంటర్‌టైనర్ 'గ్యాంబ్లర్స్'

టాకీస్: 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న యువ హీరో సంగీత్ శోభన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కేసీఆర్ ఫేమ్ రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత, జస్వికా, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో 'శ్రీవల్లి' అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు ఈ చిత్రాన్ని రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



ప్రస్తుతం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు.

దర్శకుడు కేఎస్‌కే చైతన్య మాట్లాడుతూ: "ఇదొక మిస్టరీ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో సంగీత్ శోభన్‌ను కొత్త కోణంలో చూస్తారు. ఆయన నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. చిత్రంలో ఉండే థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. పూర్తి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాలను అలరించే అంశాలున్నాయి. ఇటీవల 'కేసీఆర్' చిత్రంతో అందరి ప్రశంసలు అందుకున్న రాకింగ్ రాకేష్ ఈ చిత్రంలో ఓ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఆయన పాత్ర కూడా అందర్నీ అలరించే విధంగా ఉంది" అన్నారు.

నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనం మాట్లాడుతూ: "'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సంగీత్ శోభన్‌కు యూత్‌లో ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన గత చిత్రాలకు పూర్తి భిన్నమైన పాత్రను ఆయన ఇందులో చేస్తున్నారు. కొత్త కాన్సెప్ట్‌తో పూర్తి థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ 'గ్యాంబ్లర్స్' తప్పకుండా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.